అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం శాఖమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంవద్ద ఆప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో పాటు పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, డాక్టర్ లక్ష్యానాయుడు. డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, యువజన విభాగం అధ్యక్షుడు పార్టీ అధికార ప్రతినిధులు అప్సా సలాం, జావిద్ షరీఫ్, ఖలీమ్‌బాబా, అహాసన్ అబ్బాస్, సుధారాణి పాల్గొన్నారు.

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ల నియామకం



జయకుమార్, బెటినాలంకా

ముషీరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్లుగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జయకుమార్, బెటినాలంకాలు నియమితులయ్యారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి, పదవుల కేటాయింపులో న్యాయం చేస్తున్నారన్నారు. క్రిస్మస్ ఉత్సవాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

గోల్నాక, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను 23 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అందుతున్న ఆర్థిక సహాయాన్ని అర్హులందరూ లబ్ధిపొందాలని సూచించారు. నియోజకవర్గంలోని అర్హులైన వారందరికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వై.బుచ్చిరెడ్డి, కాలేరు రాజు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు బలమైన బూత్ కమిటీల ఏర్పాటు

గోల్నాక, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలమైన శక్తిగా నిర్మాణం చేయడానికి పటిష్టమైన పోలింగ్‌బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తుందని ఆపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ అయ్యప్ప టెంపుల్ (పోలింగ్‌బూత్ నెం.49) పోలింగ్‌బూత్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. నూతన అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్, కార్యదర్శిగా జి.ప్రశాంత్, సభ్యులుగా వంశీ, వి.ఓంకార్, ఆర్. రాజేష్, జి.సంతోష్, సంజీవ్ తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీని ఆనంద్‌గౌడ్, చుక్క జగన్, మల్లేష్‌లు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన రామకృష్ణ చంద్రమౌళి తదితరులు

సంప్రదాయాల పరిరక్షణకు శిరీష జయంత్ కృషి

నల్లకుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉన్న భారతీయ బాలబాలికలకు వేదాలు, పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అంతర్జాతీయ వేదికగా డాక్టర్ శిరీష జయంత్ తరగతులు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి అన్నారు. ఆదివారం నల్లకుంట మెయిన్ రోడ్‌లోని శృంగేరీ శంకరమఠంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ వేదిక్ స్టడీస్ (ఆస్ట్రేలియా) ప్రథమ వార్షికోత్సవం గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉత్కృష్టమైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువతో విదేశాలలో ఉన్న వారు కూడా అక్కడి మన పిల్లలకు వేదాలు, పురాణాలపై శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. శ్లోకాలు, పద్యాలు, కీర్తనలు ఆలపించి పలువురిని ప్రశంసించారు. అతి స్వల్ప కాలంలోనే భగవత్ గీత శ్లోకాలను నేర్చుకుని చక్కగా పఠించిన ఎస్.సాన్విక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాడపాటి హనుమంతరావు పాఠశాల విద్యార్థులకు పూర్వ ప్రిన్సిపాల్ శివలంక భవానీ బహుమతి ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గీతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బడేసాబ్, గిరిజారాణి, సంగీత, వెంకట్, విమల తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాలో హిందువులపై దాడులను నివారించాలి

బర్కత్‌పుర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను పూర్తిగా నివారించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌లోని హిందువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడిని నిరసిస్తూ కాచిగూడ శ్యాంబాబా ఆలయం నుంచి వీరసావర్కర్ చౌరస్తా వరకు బజరంగ్ సేన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు సురేందర్ సురాజీ, ప్రశాంత్ మహారాజ్, సంజయ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, రాఘవకుమార్, భవానీ, దీక్షిత్, వినయ్ తివారి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 17 నుంచి ప్రజాసంకల్ప పాదయాత్ర

బర్కత్‌పుర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగం, రైతాంగ, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జనవరి 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం కాచిగూడలో ప్రజా సంకల్ప పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భద్రాచలంలో జనవరి 17న ఈ పాదయాత్ర ప్రారంభిస్తున్నామని, 2026 జనవరి 17న చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. అదే రోజు ఎల్‌బీ.నగర్‌లో భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 33 జిల్లాలోని 5,280 కిలోమీటర్లు ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కె.మంజుష, సెక్రటరీ జనరల్ శ్యామల, కార్యవర్గ సభ్యులు లక్ష్మి, శ్రీలత, పి.రేఖ, కె.శారద తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఏకీకృతమైనప్పుడే రాజ్యాధికారం

నల్లకుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళితలంతా ఏకీకృతమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. జాతి ప్రయోజనాల కోసం ఉన్నత ఉద్యోగాన్ని వదిలి తన ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాటం చేసి అసువులు బాసిన పీవీ రావు వర్ధంతి హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పబ్బతిశ్రీకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దళితులకు అగ్రకులాలతో సమానంగా భూపంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డిలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజ్యాధికారం దక్కకుండా కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బి.మహేందర్, నాయకులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, యాదయ్య, ఎం.వేముల పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి



మాట్లాడుతున్న రమేష్ ముదిరాజ్

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాలలో వెనుకబడిన ముదిరాజ్ కులస్థులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌లో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముదిరాజ్ సంక్షేమ సమితి తెలంగాణ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లదుర్గం సురేష్, హైకోర్టు న్యాయవాది చిల్లా రమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బాలుగాని నర్సింహులు మాట్లాడారు. ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. 12 ఏళ్లుగా తమ ఈ డిమాండ్ కోసం పోరాటం చేస్తున్నా పాలకులు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు.

బస్తీ దవాఖానాలో వైద్యులు కరువు

● అవస్థలు పడుతున్న బీమామైదాన్ వాంబేకాలనీ వాసులు ● పని చేయని వైద్య పరికరాలు



బీమా మైదాన్ వాంబే కాలనీలో ఉన్న బస్తీ దవాఖాన

కవాడిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బీమామైదాన్‌లో ఉన్న బస్తీ దవాఖానలో నెలరోజులుగా డాక్టర్ అందుబాటులో లేరు. ఆసుపత్రిలో పనిచేసే నర్సు, ఆయాలు రోగులకు అవసరమైన చిన్నచిన్న చికిత్సలు అందిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో ఇక్కడ విధులు నిర్వహించే మహిళా డాక్టర్ మిధుల సెలవుపై వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఉన్నతాధికారులు తాత్కాలికంగా ఇద్దరు డాక్టర్లను నియమించారు. ఆ ఇద్దరి డాక్టర్లకు కూడా పర్మినెంట్ ఉద్యోగాలు రావడంతో వారుకూడా మానేశారు. దీంతో వైద్యులు లేక ఆస్పత్రి ఖాళీగా దర్శనమిస్తోంది.

2000 సంవత్సరం ఆగస్టు 20వ తేదీన వచ్చిన వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు వాల్మీకి ఆవాస్ యోజన పథకం కింద (వాంబే) మొత్తం 496 ఇళ్లను నిర్మించి ఇచ్చింది. ప్రస్తుతం కవాడిగూడ బీమా



డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

మైదాన్ వాంబే కాలనీలో మొత్తం 496 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు వాంబే కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మించారు. ఈ హాలులో గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు గదులలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేసి ప్రారంభించారు. నాటినుంచి సెప్టెంబర్ నెల వరకు డాక్టర్ మిధుల, ఒక నర్సు ఒక ఆయా విధులు నిర్వహించే వారు. బస్తీ దవాఖానాలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మిధుల సెలవుపై వెళ్లి తిరిగి విధులకు హాజరుకాలేదు. దీంతో వైద్యశాఖ అధికారులు తాత్కాలికంగా ఇద్దరు డాక్టర్లను నియమించింది. వారికి కూడా పర్మినెంట్ ఉద్యోగాలు రావడంతో మానేశారు. దీంతో బీమామైదాన్‌లో ఉన్న బస్తీ దవాఖానాలో పేదలకు వైద్య సేవలు అందడం లేదు. దాదాపు ఐదొందల కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సైతం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఒక నర్సు, ఆయాలు మాత్రం ఆసుపత్రికి వచ్చే వారికి దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలకు మందులు ఇచ్చి పంపిస్తున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో నెలరోజులుగా బీపీ మిషన్ కూడా పని చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. డాక్టర్ లేకపోవడంతో నెలరోజులుగా బీమామైదాన్ బస్తీదవాఖానాలో వైద్యం అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రజాప్రతినిధులు, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి బస్తీ దవాఖానాలో డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రేటర్‌లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



అనిల్ అరోరాకు నియామకపత్రం అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రేటర్ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ముఖ్యంగా యువతీ, యువకులు పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. కాచిగూడ డివిజన్ భూమన్నగల్లీ పోలింగ్ బూత్ నెంబర్ 214లో సంస్థాగత ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. బూత్ అధ్యక్షుడిగా అనిల్ అరోరా విజయం సాధించడంతో ఆయనకు నియామకపత్రం కిషన్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అన్నారు. బూత్ ఎన్నికలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు నందకిషోర్‌యాదవ్, ఏ.సూర్యప్రకాష్‌సింగ్, చిట్టి శ్రీధర్, సుభాష్‌పటేల్, క్షీరసాగర్, కృష్ణకుమార్, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతోనే నేతలకు సమాజంలో గుర్తింపు

హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ



నవీన్‌గౌడ్‌ను సన్మానించిన బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థంతో ప్రజలకు సేవలు అందించినప్పుడే సమాజంలో నేతలకు కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ మర్యాదపూర్వకంగా బండారు దత్తాత్రేయను కలిసి ముషీరాబాద్‌లో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... పేద ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, నాయకులు అజయ్‌గుప్తా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.కె.బోస్, డాక్టర్ మోహన్‌ప్రియ, డాక్టర్ ఎం.కె.స్టాలిన్ తదితరులు

'తమిళ భవన్ కోసం స్థలం, నిధులు కేటాయించాలి'

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 8 లక్షల తమిళుల కోసం తెలంగాణ ప్రభుత్వం తమిళుల ఆత్మభవన నిర్మాణం కోసం 10 ఎకరాల స్థలం, నిధులను కేటాయించాలని తెలంగాణ తమిళ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ తమిళ సంఘం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో కొనసాగిన రాష్ట్రంలోని 20 తమిళ పాఠశాలలను ప్రభుత్వం పునరుద్ధరించి తమిళులు మాతృభాష నేర్చుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. కేరళ రాష్ట్ర అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ మోహన్‌ప్రియ, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ఎం.కె.స్టాలిన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, డీఆర్‌డీవో జాతీయ డైరెక్టర్ డాక్టర్ మాణిక్యవాసకం, డాక్టర్ విశ్వేశ్వర్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రదాత కాకా

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ విద్యా సంస్థల ద్వారా బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు విద్యను అందించిన విద్యాదాత దివంగత కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీ ఆవరణలో వెంకటస్వామి (కాకా) వర్ధంతి సందర్భంగా కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి ఎమ్మెల్యే జి.వినోద్, కరస్పాండెంట్ జి.సరోజ వివేక్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వెంకటస్వామి ఎంతో పోరాటం చేశారన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టించారన్నారు. పెద్దపల్లి ఎంపీగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా రాష్ట్రానికి అనేక సేవలు అందించిన వ్యక్తి కాకా అని కొనియాడారు. కార్మికుల సంక్షేమానికి ఆయన ఎంతో పాటుపడ్డారని అన్నారు. కాకా ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లడం గర్వకారణమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలని విద్యా సంస్థలను నెలకొల్పిన గొప్ప విద్యాదాత కాకా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కాకా అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ జి.వంశీ తదితరులు పాల్గొన్నారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు జి.వివేక్ వెంకటస్వామి, జి.వినోద్ తదితరులు

బడుగుల ఆశాజ్యోతి వెంకటస్వామి

కవాడిగూడ: బడుగుల ఆశాజ్యోతి వెంకటస్వామి అని, ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. సామాన్య కార్యకర్త నుంచి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహం వద్ద శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్యేలు జి వివేక్‌వెంకటస్వామి, వినోద్‌కుమార్, మాజీ మంత్రి శంకర్‌రావు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఉస్తాద్ రాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య, పసుల రాంమూర్తి ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మన్నె శ్రీధర్‌తో పాటు దళిత సంఘాల నేతలు, కాకా అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.



ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు తదితరులు

అవినీతిరహిత పాలన కోసం 'టంగుటూరి' కృషి

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టంగుటూరి ప్రకాశం పంతులు రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా రాజ్యాంగ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారని, అవినీతి రహిత పరిపాలన కోసం కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ వార్షికోత్సవం విద్యానగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు బహుముఖ ప్రజ్ఞావంతులు అని, రాజకీయవేత్త, గొప్ప న్యాయవాది, సంఘసంస్కర్త అని కొనియాడారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరాం మాట్లాడుతూ రాజ్యాంగంలో గ్రామాలను చేర్పి గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ నర్సింహారావు, సభ్యులు నిరంజన్ దేశాయ్, భుజంగరావు, రాజశేఖర్, రాధాకృష్ణ, రంగనాథ్, వాణిప్రదీప్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరం.. నృత్యప్రదర్శనలు

చిక్కడపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంపటి కూచిపూడి డ్యాన్స్ అకాడమి గురువు వెంపటి లక్ష్మణకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన నయనమనోహరంగా సాగింది. అన్నమయ్య కీర్తన అలమేలుమంగ అంశానికి అనుగుణంగా మైలవరపు శిరీష నృత్యం చేయగా తరంగంను క్రాంతిప్రియ ప్రదర్శించారు. అదేవిధంగా శిష్యబృందం రూప, శైలజ, ప్రణతి, మేహిత, హర్షిత, మనోజ్ఞ, దేవర్షిణి, ధార్వి, హాసిని, వైష్ణవి, యోషిత, మనస్విని, లాస్య నృత్యాలు అలరించాయి. అతిథులుగా ఉమెన్స్ సొసైటీ సభ్యులు కిషోరికుమార్, గీతాలక్ష్మి గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తిలు పాల్గొని చిన్నారులకు బహుమతులు అందజేశారు. శ్రీవల్లిభాస్కర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

● బండ జగన్‌కు బంగారు నంది అవార్డు ప్రదానం




దివ్యాంగుల హక్కుల సాధన కోసం అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్న దివ్యాంగుల సంస్థ నేత కవాడిగూడ ఉన్నికోటకు చెందిన బండ జగన్‌ను వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నంది అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, డా.వ్రతాని రామకృష్ణగౌడ్, చింతకుంట మాణిక్‌రావు, దైవజ్ఞశర్మ అవార్డును ప్రదానం చేశారు. - కవాడిగూడ

టీడీపీ సభ్యత్వ గడువు పెంచడం సంతోషకరం

నల్లకుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టీడీపీ నాయకులు, కార్యకర్తల విజ్ఞప్తి మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కోసం మరో నెల గడువు పొడిగించడం పట్ల పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయంత్రం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి పార్టీ అధిష్ఠానం సభ్యత్వ నమోదు గడువు జనవరి 31 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యువతను పార్టీ వైపు ఆకర్షితులను చేసి పార్టీ సభ్యత్వం కల్పించేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం సంతరించుకోనున్నదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అనాథల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలి

నల్లకుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనాథ చిన్నారుల సంరక్షణ కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తేవాలని హైకోర్టు న్యాయవాది నగరవు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనాథ చిన్నారుల సంరక్షణ కోసం జనవరి 23వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అనాథలుగా లక్షల మంది రోడ్లపై తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, తినడానికి లేక, ఉండడానికి ఇంటి నివాస ఎన్నో ఇక్కట్లతో అనాథలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. వారి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనాథ చిన్నారుల కోసం చట్టం తీసుకువచ్చి పార్లమెంట్‌లో ఆమోదింపచేయాలని ప్రధానిని కోరారు. సేవ్ ది ఆర్ఫన్ నినాదంతో అనాథ సంరక్షణను ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోర్ర మోతిలాల్ నాయక్

తండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలి

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాలు, గూడెంలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించి ప్రతీ గ్రామ పంచాయతీకి 5 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతీలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్ బంజార సంఘం వార్షికోత్సవ వేడుకలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు, లావాని భూములకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. బంజార భాష (గోర్‌బోలి)ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలకు 60 గజాల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తమ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనాయక్, నాయకులు డాక్టర్ రాజన్న, చందు నాయక్, రవినాయక్, సక్రీబాయి, గణేశ్‌నాయక్, నాగునాయక్, శాంతిబాయి, రాజేష్‌నాయక్, దేవానాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు, కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో టీయూజేఏసీ ఆధ్వర్యంలో కళాకారుల హక్కుల సాధన కోసం ఆట, పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కళాకారులది కీలక పాత్ర అన్నారు. ఈ నేపథ్యంలో కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, 30 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేయాలన్నారు. చంద్రశేఖర్, చంద్రుడు, షేక్ షావలి పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్‌ల ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగ ఖాళీలపై విద్యార్థి, నిరుద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో గత 11 ఏళ్లుగా ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి, ఎంత మంది పదవి విరమణ చేశారు, ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు అనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన విడుదల చేయాలన్నారు. నిరుద్యోగుల అండతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నందగోపాల్, సుధాకర్, శ్రీనివాస్, సతీష్‌కుమార్, పృథ్వీ, వెంకటేష్, బలరామ్ పాల్గొన్నారు.